సాక్షి పశ్చిమగోదావరి

మంగళవారం : 25 : జూన్ : 2024



పంట నమోదు కోసం నిరీక్షణ

ఖరీఫ్ ప్రారంభం కావడంతో రాయితీ విత్తనాలు సిద్ధం చేశారు. పంటల వివరాలు ఇంకా నమోదు కాకపోవడంతో ప్రభుత్వ విధివిధానాల కోసం ఎదురుచూస్తున్నారు. 8లో ▸



కైకరంలో పోలీస్ పికెట్

కైకరంలో అల్లర్ల నివారణకు పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్లపై దాడుల నేపథ్యంలో గొడవలు జరగకుండా పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. 8లో ▸

ఆల్‌రౌండర్.. ఆ మాస్టారు

బోధనకే పరిమితం కాకుండా మెజీషియన్‌గా, సైకాలజిస్ట్‌గా రాణిస్తూ, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పలువురి మన్నన పొందుతున్నారు ఉపాధ్యాయుడు మదన గోపాలరెడ్డి.



8లో

న్యూస్‌రీల్

మద్ది ధర్మకర్తల మండలి సభ్యుల రాజీనామా



రాజీనామా చేసిన సభ్యులు

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు సోమవారం తమ పదవులకు రాజీనామా చేశారు. ధర్మకర్తల మండలి చైర్మన్ కీసరి సరిత, సభ్యులు తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు రాజీనామా పత్రాలను ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావుకు అందజేశారు.

ఇస్రో శాస్త్రవేత్తల దేశభక్తికి 'పుష్పక్' నిదర్శనం



భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్ కళాశాలలో పుష్పక్ విజయవంతం సంబరాల దృశ్యం

భీమవరం: ఇస్రో శాస్త్రవేత్తలు రాకెట్ ప్రయోగాలే గాకుండా అంతరిక్షంలో ఉన్న వ్యర్థాలను కూడా పర్యావరణానికి హానిలేకుండా కిందకి దించేలా రూపొందించిన పుష్పక్ ప్రపంచంలోనే ప్రథమం కావడం భారత శాస్త్రవేత్తల దేశభక్తికి నిదర్శనమని ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు అన్నారు. ఇస్రో ఆధ్వర్యంలో పుష్పక్ (రీయూజబుల్ లాంచ్ వెహికల్) విజయవంతంగా ప్రయోగించిన సందర్భాన్ని పురస్కరించుకొని సోమవారం కళాశాలలో శ్రీవిజ్ఞాన వేదిక, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఇంజనీరింగ్ విద్యార్థులు ఇలాంటి ప్రయోగాలపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి భవిష్యత్తులో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో నైపుణ్యం సాధించేలా లక్ష్య సాధనతో ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఆర్.కృష్ణ చైతన్య, కేఎం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్, పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న బి.హరికుమార్

తాడేపల్లిగూడెం (టీఓసీ): డీఆర్, పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలని ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ తాడేపల్లిగూడెం అధ్యక్షుడు బి.హరికుమార్ విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ భవనంలో సోమవారం విశ్రాంత ఉద్యోగుల కార్యవర్గ సమావేశం జరిగింది. వక్తలు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి పెన్షనర్లకు 2018 సంవత్సరం నుంచి చెల్లించాల్సిన డీఆర్ బకాయిలు, పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలని కోరారు. పీఆర్సీ ఆలస్యమయ్యే నేపథ్యంలో మధ్యంతర భృతి 30 శాతం తగ్గకుండా మంజూరు చేయాలని నూతన రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కార్యదర్శి వైవీఎస్ మూర్తి, ఎండీ ముస్తఫా, వి.కోటివీరారావు, దాసం నాగేశ్వరరావు, కె.బాలకృష్ణ, కె.వెంకటేశ్వరరావు, పి.జయరాజు, పీవీ పాపారావు, ఓ.కృష్ణకుమారి, సీహెచ్ రామలక్ష్మి, ఐవీ ప్రసాద్‌రాజు, విశ్వంరాజు, అర్జునరావు, రామ్మోహన్‌రావు, గరికిపాటి సుబ్రహ్మణ్య శర్మ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు సోమవారం రూ.1,00,000 విరాళంగా అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన తల్లాప్రగడ వెంకట సుందరం ముందుగా కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ గోవాడ సుబ్రహ్మణ్యం విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

దివ్యాంగురాలికి ఉద్యోగ నియామక ఉత్తర్వులు

ఏలూరు(మెట్రో): దివ్యాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాల నియామకంలో భాగంగా బుట్టాయగూడెంకు చెందిన మరిడి విజయకు జేసీ లావణ్యవేణి నియామక ఉత్తర్వులు అందజేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో మీకోసం కార్యక్రమంలో కుక్ (వంటమనిషి) పోస్టుకుగాను విజయకు ఉత్తర్వులు అందజేశారు.

బదిలీలకు వేళాయె!

- ఎన్నికల నేపథ్యంలో జిల్లా నుంచి ఇతర జిల్లాలకు బదిలీలు
- కోడ్ ముగియడంతో వెనక్కి వచ్చే యోచన
- జూన్ చివరి, జూలై మొదటివారంలో జోరందుకుంటాయని ఊహాగానాలు
- ఎమ్మెల్యేల నుంచి లెటర్ల కోసం పైరవీలు



సాక్షి, భీమవరం: సార్వత్రిక ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యంలో ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధమైంది. జిల్లాలో ఉన్నత స్థాయి నుంచి వివిధ శాఖల్లోని సాధారణ ఉద్యోగుల వరకు మార్పులు, చేర్పులు ఉంటాయని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే కలెక్టర్ల బదిలీలు జరగగా ఈ నెలాఖరు, జూలై మొదటి వారంలో బదిలీలు జోరందుకుంటాయని అధికార వర్గాల్లో ప్రచారం జోరుగా సాగుతోంది.

ఎన్నికల ముందు బదిలీలు : ఎన్నికల నేపథ్యంలో వివిధ శాఖల్లో మూడేళ్ల పైబడిన, స్థానిక మూలాలున్న అధికారులను ఈసీ మార్గదర్శకాలు అనుసరించి బదిలీ చేశారు. ప్రధానంగా ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలీస్, రెవెన్యూ, మండల పరిషత్, మున్సిపల్, ఇతర శాఖలకు చెందిన మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారులను ఎన్నికల ముందు ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. కొత్త జిల్లా ఏర్పాటు నుంచి కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన పి.ప్రశాంతి అగ్రికల్చర్ మార్కెటింగ్ డైరెక్టర్‌గా, ఎస్పీగా సేవలందించిన రవిప్రకాష్ ఏసీబీ ఎస్పీగా బదిలీ అయ్యారు. వారి స్థానంలో కలెక్టర్‌గా సుమిత్‌కుమార్, ఎస్పీగా డాక్టర్ అజిత బాధ్యతలు చేపట్టారు. నరసాపురం డీఎస్పీ మనోహరాచారి విజయవాడ కార్యాలయానికి బదిలీ కాగా, విశాఖపట్నం నుంచి జి.శ్రీనివాస్ వచ్చారు. భీమవరం డీఎస్పీ బి.శ్రీనివాస్ రాయలసీమ ప్రాంతానికి బదిలీకాగా ఆయన స్థానంలో చిత్తూరు నుంచి నారాయణస్వామిరెడ్డి వచ్చారు. పలువురు సీఐలు బదిలీ అయ్యారు. నరసాపురం మున్సిపల్ కమిషనర్ సత్యవాణి కాకినాడ బదిలీ కాగా ఆమె స్థానంలో ఉయ్యూరు కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, ఆకివీడు నగర పంచాయతీ కమిషనర్ వెంకటేశ్వరరావు భీమవరం మున్సిపాలిటీకి బదిలీ కాగా ఆయన స్థానంలో తణుకు మున్సిపాలిటీ నుంచి జి.కృష్ణమోహన్, పాలకొల్లు మున్సిపల్ కమిషనర్ బి.శేషాద్రి చీరాల బదిలీ కాగా చీరాల నుంచి విజయసారథి కమిషనర్‌గా వచ్చారు. రెవెన్యూ విభాగంలో తహసీల్దార్లలో ఆరుగురు డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు బదిలీ కాగా ఒకరు తూర్పుగోదావరి, ఒకరు అల్లూరి సీతారామరాజు, 12 మంది కృష్ణా, ఇద్దరు ఎన్టీఆర్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఉండి, గణపవరం, పాలకోడేరు మండలాలకు చెందిన ముగ్గురు ఈఓపీఆర్డీలు బదిలీపై వెళ్లారు. వివిధ మండలాల నుంచి ఎంపీడీఓలు, ఎస్ఐలు వివిధ జిల్లాలకు బదిలీపై వెళ్లారు.

బదిలీలకు రంగం సిద్ధం

ఎన్నికల ప్రక్రియ ముగిసి ప్రభుత్వ పాలన మొదలైన నేపథ్యంలో బదిలీలకు రంగం సిద్ధమవుతుంది. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం తమకు అనుకూలమైన ఉద్యోగులను నియమించుకోవడం సర్వసాధారణం. ఈ క్రమంలో కొత్త ప్రభుత్వం ఉద్యోగులను నియమించుకునే పనిలో నిమగ్నమైంది. ఇప్పటికే జిల్లాలో కీలకమైన కలెక్టర్ల బదిలీలు జరిగాయి. కలెక్టర్ సుమిత్‌కుమార్ చిత్తూరు జిల్లాకు బదిలీ కాగా ఏపీ టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ సి.నాగరాణి జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఒకటి రెండు రోజుల్లో పోలీస్ శాఖలోను కీలక బదిలీలు ఉంటాయన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

బదిలీల్లో ఎమ్మెల్యేల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. వారి అంగీకారం పొందిన వారికే ఆయా నియోజకవర్గాల్లో విధుల్లో చేరేందుకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేస్తుంటారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ముందు ఇతర జిల్లాలకు బదిలీ అయిన అధికారులు సొంత జిల్లాకు తిరిగి వచ్చేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. తమకు కావాల్సిన చోట పోస్టింగ్ కోసం సంబంధిత నియోజకవర్గ ఎమ్మెల్యేను కలిసి తమకు అవకాశం

విల్లింగ్ లెటర్ల కోసం యత్నాలు

ఇవ్వాలని విల్లింగ్ లెటర్ల కోసం పైరవీల్లో నిమగ్నమైనట్టు తెలుస్తోంది. మరోపక్క తమకు అనుకూలమైన అధికారులను తెచ్చుకునేందుకు ఎమ్మెల్యేలతో పాటు కూటమి నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పుడు గెలిచిన వారిలో పాలకొల్లు, ఆచంట, భీమవరం, తణుకు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు పాతవారే ఉన్నారు. 2014 నుంచి 2019 టీడీపీ హయాంలో తమకు అనుకూలంగా పనిచేసిన అధికారులకు తిరిగి తమ నియోజకవర్గాల్లో బాధ్యతలు అప్పగించే పనిలో ఉన్నారు. దిగువస్థాయిలోను తమకు కావాల్సిన అధికారులను నియమించుకోవడం ద్వారా తమ పనులు చేయించుకునే వీలుంటుందని స్థానిక నాయకులు భావిస్తున్నారు. రానున్న రెండు వారాల్లో అన్ని శాఖల్లోను జిల్లాలోని ఉన్నత స్థాయి నుంచి డివిజన్, మండల స్థాయి వరకు బదిలీలు ఉంటాయన్న ప్రచారం జరుగుతోంది.

ఫిర్యాదులకు పరిష్కారం చూపాలి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రజా ఫిర్యాదులకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు జిల్లా అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేటు సమావేశ మందిరంలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను జాగ్రత్తగా పరిష్కరించాలన్నారు. ఫిర్యాదును క్షుణ్ణంగా చదివి కచ్చితమైన పరిష్కారాన్ని వేగవంతంగా చూపాలన్నారు. పెండింగు లేకుండా సమస్యలను పరిష్కరించడంతో పాటు అర్జీదారులు సంతృప్తి చెందే స్థాయిలో ఉండాలన్నారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో 86 ఫిర్యాదులను ప్రజల నుంచి స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల అధికారి కె.సి.హెచ్.అప్పారావు, డిప్యూటీ కలెక్టరు బి.శివనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సెంట్రల్ పార్కింగ్ వద్ద గోవిందా.. గోవిందా.. ఆకారంలో



మాధవ కల్యాణ మండపం ముఖ ద్వారం వద్ద ఏనుగుల ఆకారంలో మొక్కలు

ఆధ్యాత్మికం.. చెంతనే ఆహ్లాదం

శ్రీవారి క్షేత్రంలో పచ్చని గార్డెన్‌లు





కల్యాణకట్ట వద్ద గోవింద నామంతో కనువిందు చేస్తున్న గార్డెన్

ద్వారకాతిరుమల: ఆధ్యాత్మిక క్షేత్రం చిన్నతిరుపతి ఆహ్లాదభరితంగా మారింది. పచ్చని గార్డెన్లతో కళకళలాడుతోంది. రహదారి పక్కన వివిధ ఆకృతుల్లో దర్శనమిస్తున్న మొక్కలు చూపరులకు కనువిందు చేస్తున్నాయి. దాంతో క్షేత్రంలో ఆధ్యాత్మికతతో పాటు, ఆహ్లాదం వెల్లివిరుస్తోంది. కొండపైకి వెళ్లే ఘాట్‌రోడ్డులోని కల్యాణకట్ట వద్ద గోవింద నామంతో గార్డెన్ ఆకర్షణీయంగా ఉంది. ఉగాది మండపం వద్ద గార్డెన్‌లో గెద్ద, జిరాఫీ ఆకారంలో ఉన్న మొక్కలు, కొండపైన జంటగోపురాలు, మాధవ కల్యాణ మండప ముఖ ద్వారాల వద్ద స్వాగతం పలుకుతున్నట్టుగా ఉన్న ఏనుగు ఆకారాలు, సెంట్రల్ పార్కింగ్ ప్రాంతంలో రహదారి పక్కన గోవిందా.. గోవిందా.. ఆకారంలో ఉన్న మొక్కలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. కొండపైన కాటేజీల వద్ద పచ్చని అందాలు, పూల సోయగాలు భక్తుల మదిని దోచుకుంటున్నాయి.



జిరాఫీ ఆకారంలో ఉన్న మొక్క

డీఈఎల్‌ఈడీ పరీక్షకు 71 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): డీఈఎల్‌ఈడీ 4వ సెమిస్టర్ పరీక్షలు సోమవారం జరిగాయి. ఈ పరీక్షకు 71 మంది విద్యార్థులు హాజరయ్యారని, హాజరు నూరుశాతంగా నమోదయిందని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు. ఈ పరీక్షల్లో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు.

సమస్యలు తక్షణం పరిష్కరిస్తాం

భీమవరం: చట్ట ప్రకారం త్వరితగతిన ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించాలని ఎస్పీ వేజెండ్ల అజిత అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. బాధితుల సమస్యలను తెలుసుకుని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(అడ్మిన్) వి.భీమారావు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ అజిత

27న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

ఏలూరు(మెట్రో): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలు ఈ నెల 27న ఉదయం 10 గంటల నుంచి ఏలూరులోని జెడ్పీ చైర్‌పర్సన్ చాంబర్‌లో నిర్వహిస్తారని జెడ్పీ సీఈఓ కె.సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు, జెడ్పీ సభ్యులందరూ హాజరు కావాలని సూచించారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు

భీమవరం (ప్రకాశంచౌక్): కలెక్టరేట్ సమావేశ మందిరంలో అతిసార వ్యాధి నిర్మూలన అవగాహన గోడ ప్రతులను జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అతిసార, డెంగ్యూ తదితర అంటువ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు, వైద్య సిబ్బంది విస్తృతంగా గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు డయేరియా నియంత్రణపై ప్రచార కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు.

టార్గెట్లతో సతమతం

- ప్రైవేటు స్కూళ్ల సిబ్బందిపై యాజమాన్యం ఒత్తిడి
- విద్యార్థులను చేర్పించాలంటూ సిబ్బందికి లక్ష్యాలు
- విద్యాసంవత్సరం ప్రారంభమైనా చేరికలంటూ ఇబ్బంది



భీమవరం: ప్రైవేటు విద్యాసంస్థల్లోని ఉపాధ్యాయుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది. పనిచేస్తున్న స్కూల్ యాజమాన్యాలు విద్యార్థులను చేర్పించాలని టార్గెట్లు పెట్టి వేధింపులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత విద్యాసంవత్సం ప్రారంభమై 10 రోజులు గడిచిపోయినా ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని.. విద్యార్థులను చేర్పించాలని ఒత్తిడి తెస్తున్నారు. దీంతో ఉన్న ఉద్యోగం వలుదుకోలేక, కొత్తగా విద్యార్థులను చేర్పించలేక ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. ఒక వైపు విద్యాబోధన, మరోవైపు టార్గెట్లు పూర్తి చేయాల్సిన పనిలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల ఉపాధ్యాయులు ఒత్తిడికి లోనవుతున్నారు. అసలే అరకొర జీతాలతో పనిచేస్తున్న సిబ్బందికి ఈ టార్గెట్లు తలకు మించిన భారంగా తయారయ్యాయి.

వేసవిలోనే ప్రారంభం : దాదాపు ఏడాది పాటు విద్యాబోధనతో ఒత్తిడికి గురైన ఉపాధ్యాయులు, విద్యార్థులు వేసవి సెలవులతో సేదతీరతారు. అయితే ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు వారి వద్ద పనిచేసే ఉపాధ్యాయులు, సిబ్బందికి వేసవి సెలవుల్లో విద్యార్థులను చేర్పించే పని అప్పగిస్తున్నారు. విద్యార్థులను చేర్పించినందుకు ఉపాధ్యాయులకు కొంతమొత్తంలో నగదు ఇస్తున్నా వారికి విధిస్తున్న టార్గెట్లను పూర్తిచేయడానికి పడరాని పాట్లు పడుతున్నారు. మండు టెండల్లో ఊరూర తిరిగి పిల్లలను చేర్పించేందుకు శ్రమిస్తున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమై రోజులు గడుస్తున్నా ఇంకా చేర్పించాలని ఒత్తిడి చేయడం విశేషం.

యాజమాన్యం చెబితే చేయాల్సిందే

ప్రైవేటు స్కూళ్లలో ఉపాధ్యాయులు, సిబ్బంది స్కూల్ యాజమాన్యాలు ఏ పని చెబితే అది చేయాల్సిందే. లేదంటే ఉద్యోగం ఊడిపోతుంది. గతంలో విద్యార్థులను చేర్పించేందుకు ప్రత్యేక సెక్షన్ ఉండేది. ప్రస్తుతం దానిని తొలగించి మొత్తం పని ఉపాధ్యాయులతోనే చేయిస్తున్నారు. 6వ తరగతి నుంచి టెన్త్ క్లాసు వరకు అదనపు క్లాసులు ఏర్పాటుచేస్తూ ఉపాధ్యాయులపై మరింత ఒత్తిడి పెంచుతున్నారు.

జిల్లాలో 563 ప్రైవేటు విద్యాసంస్థలు

జిల్లాలో దాదాపు 563 ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ఉండగా వాటిలో సుమారు 1.30 లక్షల మంది విద్యనభ్యసిస్తున్నారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో దాదాపు 16 వేల మందికి పైగా ఉపాధ్యాయులు, సిబ్బంది పనిచేస్తున్నట్లు అంచనా. స్కూళ్ల నిర్వహణ ఖర్చులు పెరిగాయని దానికి తగ్గట్లు విద్యార్థుల సంఖ్య పెరగకుంటే జీతాలు చెల్లించడం కష్టమని చెప్పి సిబ్బందిని బెదిరిస్తున్నట్లు వాపోతున్నారు.

అధికారుల తనిఖీ అంతంత మాత్రమే

ప్రైవేటు విద్యాసంస్థల్లోని మౌలిక వసతులు, సిబ్బంది సమస్యలపై విద్యాశాఖాధికారులు తనిఖీలు చేయాల్సివున్నా అమలు జరగడం లేదని చెబుతున్నారు. అధికారులు స్కూళ్లకు వెళ్లి పరిసరాలను పరిశీలించకుండా, సిబ్బంది సమస్యలను తెలుసుకోకుండానే యాజమాన్యాలతో మొక్కుబడిగా మాట్లాడి వెళ్లిపోతున్నారని, ఫిర్యాదుచేస్తే ఉద్యోగం ఊడిపోతుందనే భయంతో ఉపాధ్యాయులు మిన్నకుండిపోతున్నారని వాపోతున్నారు.



క్లుప్తంగా

వైద్య కళాశాలకు ప్రభావతి పార్థివదేహం


గుబ్బల ప్రభావతి (ఫైల్)

భీమవరం: పట్టణంలోని గునుపూడికి చెందిన గుబ్బల ప్రభావతి (83) వృద్ధాప్యంతో ఆదివారం మృతి చెందారు. మరణానంతరం తన పార్థివదేహాన్ని రాజమండ్రి వైద్య కళాశాలకు అందజేయాలని పదేళ్ల క్రితమే ఆమె అంగీకార పత్రం రాసి ఇవ్వడంతో ఆ మేరకు భర్త గుబ్బల సత్యనారాయణ మూర్తి, కుమారులు రమేష్‌బాబు, ప్రసాద్ జీఎస్ఎల్ మెడికల్ కాలేజీకి ప్రభావతి మృతదేహాన్ని అందజేశారు. కళాశాలలోని మెడికోలు, ఇతర సిబ్బంది మృతదేహంపై పూలు చల్లుతూ గౌరవవందనం సమర్పించి అనంతరం అనాటమీ డిపార్ట్‌మెంట్‌కు స్వీకరించారు. విశాల హృదయంతో ప్రభావతి శరీరదానం చేయడంపై పలువురు కుటుంబ సభ్యులను అభినందించారు.

వందన వికాస్‌లో యంత్రాల కొనుగోలుకు టెండర్లు


టెండర్ ప్రక్రియ నిర్వహిస్తున్న పీఓ సూర్యతేజ

బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏ ద్వారా నిర్వహిస్తున్న వందన వికాస్ (వీడీవీకేఎస్) కేంద్రాల్లో యంత్రాల కొనుగోలుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ సోమవారం ఐటీడీఏలో నిర్వహించారు. పీఓ ఎం.సూర్యతేజ సమక్షంలో అడ్డాకుల, కారం, చింతపండు, చింతపిక్క తీసే యంత్రాలు, నేల వేము మొక్కల కటింగ్ యంత్రాల కొనుగోలుకు సంబంధించి టెండర్లు జరిగాయి. రాజమండ్రి, విశాఖపట్నం, హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టర్లు పాల్గొని టెండర్లను దక్కించుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ పీవీఎస్ నాయుడు, వెలుగు ఏపీడీ నాగేశ్వరరావు, జీసీసీ డీఎం జి.పార్వతీశ్వరరావు, ఇండస్ట్రియల్ అధికారిణి పావని, తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు కోసం నిరీక్షణ

- వెబ్‌ల్యాండ్‌లో నమోదైతేనే రైతులకు రాయితీలు
- ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా కానరాని నమోదు ప్రక్రియ
- కొత్త ప్రభుత్వం మార్గదర్శకాల కోసం ఎదురుచూపులు


దొరమామిడి సమీపంలో పొలంలో దుక్కి దున్నుతున్న రైతు

బుట్టాయగూడెం: గత ఏడాది కంటే ఈ ఏడాది ముందుగానే నైరుతి రుతుపవనాలు రాష్ట్రాన్ని పలకరించినప్పటికీ జూన్ మొదటి వారంలో మోస్తరు వర్షాలు మాత్రమే కురిశాయి. ఆశించిన స్థాయిలో వర్షాలు పడకపోవడంతో రైతులు నిరాశకు గురయ్యారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల ప్రభావంతో సాధారణం కంటే అధిక వర్షాలు నమోదవుతాయని వాతావరణశాఖ అంచనా వేసినప్పటికీ ఆ పరిస్థితులు కనిపించలేదు. జూన్ 3వ తేదీన రాష్ట్రంలో ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు అన్ని ప్రాంతాలకు విస్తరించినప్పటికీ గిరిజన ప్రాంతంలో మోస్తరు నుంచి సాధారణ వర్షాలు మాత్రమే కురవగా, గత రెండు రోజులుగా వర్షాలు జోరుగా కురుస్తుండటంతో రైతులు ఖరీఫ్ సాగు పనులు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో సాగుకు సంబంధించిన రాయితీ విత్తనాలను వ్యవసాయాధికారులు సిద్ధం చేశారు. అయితే రైతుల పంటల వివరాలు నమోదు కావాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం నుంచి ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన విధివిధానాలు రావాల్సి ఉందని చెబుతున్నారు.

వెబ్ ల్యాండ్ ఆధారంగానే రాయితీలు

గతంలో రైతులకు సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాలు, అడంగల్ కాపీలు తీసుకువచ్చి ఇస్తే సబ్సిడీపై వ్యవసాయ పరికరాలైన దుక్కు, ప్లేట్లు, స్ప్రేయర్లు, నాగళ్లు, నూర్పిడి యంత్రాలు, టార్పాలిన్లు, పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు వంటివి వ్యవసాయశాఖ అధికారులు పంపిణీ చేసేవారు. అయితే ఈ ఏడాది నుంచి వెబ్ ల్యాండ్‌లో పంట వివరాల నమోదు ఆధారంగా రైతులకు విత్తనాల నుంచి యంత్ర పరికరాలను పంపిణీ చెయ్యనున్నారు. అయితే ఈ మేరకు రైతులు పొలాలతో కూడిన వివరాలు వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసుకుని ఉండాలి. అలాగైతే నమోదైన పొలాలకు సంబంధించిన రైతులకు ఆయా పథకాల రాయితీలు అందుతాయి.

డి-క్రిషిలో మొత్తం వివరాలు

ప్రస్తుతం వ్యవసాయశాఖ సాంకేతికతను వినియోగిస్తూ సబ్సిడీపై అన్ని రకాల విత్తనాలను రైతులకు అందించే ప్రయత్నం చేస్తోంది. ఈ మేరకు డి-క్రిషి వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ వెబ్‌సైట్‌లో రైతు ఆధార్ కార్డు ఎంటర్ చెయ్యగానే ఆ రైతుకు సంబంధించిన పొలాల వివరాలు మొత్తం వస్తాయి. అలా కాకుంటే ఎంతపొలం ఉన్నా రాష్ట్ర ప్రభుత్వ రాయితీలకు అనర్హులుగా పరిగణిస్తారు. అయితే రైతులు తప్పనిసరిగా ఆధార్ కార్డుతో డి-క్రిషి వెబ్‌సైట్‌లో వారి పంటల వివరాలను నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారులు కోరుతున్నారు.

మన్యంలో ఖరీఫ్ ప్రణాళిక సిద్ధం

ఏజెన్సీ ప్రాంతంలోని మండలాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌లో సుమారు 15,569 హెక్టార్లలో పంటల సాగు లక్ష్యంగా వ్యవసాయశాఖ అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. వీటిలో 13,295 హెక్టార్లలో వరి, 1,484 హెక్టార్లలో మొక్కజొన్న, 382 హెక్టార్లలో మినుము, 224 హెక్టార్లలో పెసర, 284 హెక్టార్లలో కంది, తదితర పంటలు పండించేలా కృషి చేస్తున్నామని అధికారులు తెలిపారు.

డి-క్రిషిలో నమోదు తప్పనిసరి



ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం నుంచి రాయితీలు పొందాలంటే రైతులు డీ-క్రిష్ వెబ్‌సైట్‌లో వారి వివరాలను నమోదు చేసుకోవాలి. అలాగే పంటల నమోదుకు సంబంధించి కొత్త ప్రభుత్వం మార్గదర్శకాలు వచ్చిన వెంటనే నమోదు కార్యక్రమం చేపడతాం. ప్రస్తుతం రైతు భరోసాలో డి-క్రిషి వెబ్‌సైట్‌లో నమోదు చేసుకున్న వారికి సబ్సిడీపై వరి, పచ్చిరొట్ట, పిల్లిపెసర విత్తనాలను పంపిణీ చేస్తున్నాం.

– డి.ముత్యాలరావు, మండల వ్యవసాయాధికారి, బుట్టాయగూడెం

ప్రత్యామ్నాయ రైళ్లు నడపాలి


భీమవరంలో ప్రజా సంఘాల నాయకుల సమావేశం దృశ్యం

భీమవరం: తాత్కాలికంగా రద్దు చేసిన రైళ్ల స్థానంలో ప్రత్యామ్నాయ రైళ్లను నడపాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు కోరారు. సోమవారం భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ప్రజా సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి కాగిత వెంకటరమణ, బిల్డర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు గన్నాబత్తుల శ్రీనివాస్ మాట్లాడుతూ పలు రైళ్లను రద్దు చేయడం వల్ల వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారన్నారు. రద్దుచేసిన రైళ్ల స్థానంలో ప్రత్యామ్నాయ రైళ్లు నడపడానికి కృషి చేయాలని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మకు ఫ్యాక్స్ ద్వారా వినతి పత్రాన్ని పంపించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఉన్న రైళ్లు సరిపోక ప్రయాణికులు సతమతమవుతున్నారని, రైల్వే ట్రాక్‌ల మరమ్మతుల కారణంగా పలు రైళ్ల మళ్లింపు, రద్దు వల్ల నరసాపురం, రాజమండ్రి, నిడదవోలు, విజయవాడ ప్రాంతాల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆందోళన వ్యక్తం చేశారు. సామాన్య ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలన్నారు. కంతేటి వెంకట్రాజు, చెరుకువాడ రంగసాయి, ఎంవీ రమణ, పరుచూరి నాగేశ్వరరావు, మట్లపూడి సత్యనారాయణ, అరసవల్లి సుబ్రహ్మణ్యం, నందమూరి రాజేష్, నరహరిశెట్టి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య


ఉరి వేసుకుని వేలాడుతున్న షేక్ సల్మా మృతదేహం

కామవరపుకోట: కొత్తూరు గ్రామంలో సోమవారం ఓ వివాహిత ఉరి వేసుకుని బలన్మరణానికి పాల్పడింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తూరు గ్రామానికి చెందిన షేక్ సల్మా (25) భర్త ఖాసిం రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రామంలోని ఓ హోటల్‌లో పనిచేస్తూ తన ఇద్దరు పిల్లలతో కలిసి గ్రామంలోని వశిష్ట స్కూలు సమీపంలో అద్దె ఇంట్లో నివసిస్తోంది. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ ఉండటాన్ని సాయంకాలం స్కూల్ నుంచి వచ్చిన పిల్లలు గమనించి స్థానికులకు తెలిపారు. సమాచారం అందుకున్న తడికలపూడి ఎస్సై జయబాబు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే వివాహిత ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వేధింపులపై కేసు నమోదు

పాలకోడేరు: దురలవాట్లకు బానిసై భార్యను వేధింపులకు గురిచేస్తున్న భర్తపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. విస్సాకోడేరు క్రిస్టియన్ పేటకు చెందిన నమ్మి నిహారికకు 19 ఏళ్ల క్రితం నమ్మి రమేష్‌తో వివాహమైంది. వివాహ సమయంలో రూ.70వేలు కట్నం, పది కాసుల బంగారం ఇచ్చారు. వీరికి ఇద్దరు పిల్లలు. అయితే చెడు అలవాట్లకు బానిసైన రమేష్ అప్పులు చేయడమే కాక వేరే మహిళతో వివాహేతర సంబంధం ఏర్పరుచుకుని భార్యను, పిల్లలను పట్టించుకోవడం లేదు. దీనికి తోడు వేధింపులకు గురిచేస్తుండటంతో భార్య నిహారిక పోలీసులను ఆశ్రయించింది. భార్య ఫిర్యాదు మేరకు భర్తపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాళం శ్రీనివాసరావు చెప్పారు.

ధాన్యం బకాయిలు చెల్లించాలని ధర్నా


విస్సాకోడేరులో ధర్నా చేస్తున్న రైతు సంఘాల నాయకులు

పాలకోడేరు : ధాన్యం బకాయి సొమ్ములను ప్రభుత్వం వెంటనే వడ్డీతో సహా రైతులకు చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. విస్సాకోడేరు గ్రామ సచివాలయం వద్ద ఏపీ రైతు సంఘం, ఏపీ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ధర్నాలో బలరాం రైతులకు మద్దతు, సంఘీభావం తెలిపి మాట్లాడారు. రైతులు ప్రభుత్వానికి ధాన్యం విక్రయించిన సొమ్ములను నెలల తరబడి చెల్లించకపోవడంతో సన్న చిన్నకారు రైతులు, కౌలు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. సార్వా పంటకు పెట్టుబడుల కోసం రైతులు ఆందోళనతో ఎదురుచూస్తున్నారన్నారు. జిల్లాలో ఇప్పటికీ రూ.800 కోట్లకు పైగా రైతులకు బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ఆకుమడులకు, విత్తనాలు, ఎరువులు, ఇతర ఖర్చులకు చేతిలో చిల్లిగవ్వ లేక రైతులు తమకు చెల్లించాల్సి ఉన్న సొమ్ము కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి బాధాకరం అన్నారు. రైతులకు చెల్లించాల్సిన బకాయిలను వడ్డీతో సహా తక్షణం చెల్లించాలని బలరాం డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కలిదిండి గోపాలరాజు, కలిదిండి బంగార్రాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శేషపు అశ్రియ్య, కౌలురైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

కైకరంలో పోలీస్ పికెట్

10 మందిపై కేసు నమోదు


కైకరంలో పోలీసు పికెట్‌ను పర్యవేక్షిస్తున్న సీఐ సుభాష్, ఎస్సై మణికుమార్

ఉంగుటూరు : కైకరం గ్రామంలో అల్లర్ల నివారణకు సోమవారం పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఎన్నికల ఫలితాల అనంతరం కొందరు వీధుల్లో వీరంగం సృష్టిస్తూ ఇళ్లమీదకు వెళ్లి దౌర్జన్యానికి పాల్పడిన నేపథ్యంలో మాజీ జెడ్పీటీసీ చింతల వాసు ఇంటి సమీపంలో ఐదు గుళ్ల సెంటర్‌లో పికెట్ ఏర్పాటు చేసి గొడవలు జరగకుండా పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం ఇళ్ల మీదకు వెళ్లి గొడవలు, దౌర్జన్యానికి పాల్పడిన ఘటనలో పది మందిపై పోలీసులు కేసులు నమోదు చేశామని, అయితే పరారీలో ఉన్న వీరి కోసం గాలిస్తున్నట్లు ఎస్సై మణికుమార్ చెప్పారు. నిందితులపై 506, 447, 427 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా, వైఎస్సార్ సీపీ నాయకుడు పుప్పాల గోపిని పలువురు ఆ పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సోమవారం పరామర్శించారు. అలాగే ఆర్యవైశ్యసంఘం రాష్ట్ర నాయకుడు కోనా శ్రీనివాసరావును తెలుగుదేశం పార్టీ నాయకులు, ఆర్యవైశ్యసంఘం ప్రతినిధులు పరామర్శిస్తున్నారు.

దురదృష్టకరం

గ్రామంలో ఇటువంటి గొడవలు జరగటం దురదృష్టకరమని వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నక్కా శ్రీను అన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని చక్కని పాలన అందించాల్సింది పోయి, ఇలాంటి గొడవలకు పాల్పడటం ప్రతిపక్ష, పాలకపక్ష నాయకులు ఇళ్లపై దౌర్జన్యాలకు దిగడం సరికాదని అన్నారు.

టీడీపీ వర్గీయులు దాడి చేయడం దారుణం

కైకరం గ్రామంలో ఇళ్లకు వచ్చి దౌర్జన్యాలు చేయడం దారుణమని గ్రామస్తుడు, ఎస్సీ సెల్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు గంజి ప్రభాకరరావు అన్నారు. గొడవలకు పురిగొల్పిన, పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొనేలా పోలీసులు నిష్పక్షపాతికంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

J.SIKILE SCHOOL
SENIOR SECONDARY SCHOOL, AFFILIATED TO C.B.S.E.
NARSAPUR-534 275, West Godavari Dist., A.P.
Email : edu@jsikile.in www.jsikile.in
STAFF VACANCIES FOR THE ACADEMIC YEAR 2024-25
• PGT - PHYSICS / ACCOUNTANCY BUSINESS STUDIES / ECONOMICS
• PRIMARY - HINDI / KINDERGARTEN TEACHERS
• LIBRARIAN - FEMALE • PET
• COMPUTER HARDWARE INCHARGE
• Apply in person with original Certificates on 26.06.2024, WEDNESDAY to 28.06.2024, FRIDAY between 10:30 A.M. and 5:00 P.M. at the School Campus.
• One way second class train/bus fare in the shortest route will be reimbursed.
WE ARE LOOKING FOR COMMITTED TEACHERS WHO ARE GOOD AT COMMUNICATION SKILLS
Tel : (08814) 272327 / (0) 99984 35681 / CORRESPONDENT
AN ISO 9001 : 2015 CERTIFIED INSTITUTION

కట్నం వేధింపులపై కేసుల నమోదు

ఉండి: అదనంగా కట్నం తీసుకురావాలంటూ వేధింపులకు గురిచేస్తున్నట్లు అందిన రెండు వేర్వేరు ఫిర్యాదులపై ఎస్సై ఎం.లక్ష్మణ్ ఆదివారం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. ఉండి శివారు రామాపురానికి చెందిన ఝాన్సీకి ఆకివీడు మండలం గుమ్ములూరుకు చెందిన రాచూరి సురేష్‌తో 2008లో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు. దురలవాట్లకు సురేష్ బానిసై భార్యను వేధింపులకు గురి చేయడమే కాకుండా పెళ్లి సమయంలో ఇచ్చిన రూ.40 వేలు కాకుండా అదనంగా మరో రూ.లక్ష కట్నం తేవాలంటూ భర్త సురేష్ వేధింపులకు గురిచేశాడు. భర్తతో పాటు అత్తమామలు, ఆడపడుచు మానసికంగా, శారీకంగా వేధించారంటూ ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. అలాగే మరో ఘటనలో ఉండి నక్కరాజుగుంటకు చెందిన సునందకు నర్సాపురం మండలం రుస్తుంబాదకు చెందిన వర్ధనపు ప్రభాకర్‌తో 2022లో వివాహమైంది. వివాహ సమయంలో భర్త, అత్తమామ, అడపడుచులు, వారి భర్తలు మొత్తం అరుగురి డిమాండ్ మేరకు రూ.15 లక్షలు కట్నం, ఆడపడుచు కట్నంగా మరో రూ.3 లక్షలు, మూడు కాసుల బంగారు తాడు ఇచ్చారు. అయితే కాపురానికి వెళ్లిన కొంతకాలం తరువాత అదనంగా మరో రూ.10 లక్షలు కట్నం తేవాలంటూ తనను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నట్లు బాధితురాలు సునంద పోలీసులకు ఫిర్యాదు చేసింది.

యథేచ్ఛగా మట్టి రవాణా

చేతులెత్తేసిన రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం


గోపవరంలో చెరువు మట్టిని పొక్లెయిన్‌తో ట్రాక్టర్ ట్రక్కులోకి లోడు చేస్తున్న దృశ్యం

ముసునూరు: మండలంలో మట్టి అక్రమ రవాణా అడ్డూ అదుపు లేకుండా యథేచ్ఛగా జరుగుతోంది. గ్రామాల్లో మట్టిని అక్రమంగా తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ చోటామోటా నాయకులు జేబులు నింపుకుంటున్నారు. టీడీపీ అధికార పగ్గాలు చేపట్టిన వెంటనే మండలంలో మట్టి అక్రమ రవాణా మాఫియా పేట్రేగిపోయింది. మండలంలోని లోపూడి, రమణక్కపేట, గోపవరం, చెక్కపల్లి, చింతలవల్లి తదితర గ్రామాల్లో జేసీబీలతో రేయింబవళ్లు పగలు తేడా లేకుండా వందలాది ట్రాక్టర్ల ద్వారా విలువైన చెరువు మట్టిని తరలిస్తున్నారు. గోపవరంలో టీడీపీ నేతలే ట్రాక్టర్ ట్రక్కు మట్టి ధర రూ.650గా నిర్ణయించి మరీ అమ్ముకుంటున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారం మనదే అడ్డుకునేవారే లేరంటూ చెలరేగి మట్టి దందా చేస్తూ అక్రమార్జన చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పోలీసులు, రెవెన్యూ అధికారులు సైతం చెరువుల్లోకి అడుగు పెట్టడానికి కూడా వీల్లేదంటూ చోటా నాయకులు హుకుం జారీ చేసి మరీ మట్టి తోలకాలు నిర్వహిస్తుండటం గమనార్హం. గతంలో మట్టి, ఇసుక ట్రాక్టర్ కంటపడితే వెంటాడి పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసులు పెట్టి, రూ.5 వేల నుంచి రూ.10 వేలు వరకు జరిమానా వేయనిదే వదలిపెట్టని రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పత్తా లేకుండా పోయిందని విమర్శిస్తున్నారు. దీనికి తోడు స్థానిక ఎమ్మెల్యేకు మంత్రి పదవి దక్కడంతో తెలుగు తమ్ముళ్లు చెలరేగిపోయి అక్రమాలకు పాల్పడుతున్నారని అంటున్నారు. దీనిపై తహసీల్దార్ జవహర్ బాజీని వివరణ కోరగా, తక్షణమే సిబ్బందిని పంపి మట్టి అక్రమ రవాణాను అడ్డుకుంటామని చెప్పారు. గ్రామ పంచాయతీలకు చెందిన చెరువుల విషయంలో ఎంపీడీఓకు సమాచారం అందించి, చర్యలు తీసుకునే విధంగా కృషి చేస్తామని తహసీల్దార్ చెప్పారు.

WANTED
అన్ని ట్రేడ్‌లు వారికి గల్ఫ్ మరియు యూరోప్ వీసా కొరకు సీవీ పంపగలరు మరియు తణుకు బ్రాంచ్ నందు స్టాఫ్ కావలెను. కంప్యూటర్ నాలెడ్జ్ తప్పనిసరి.
సాయినాథ్ మేన్ పవర్ కన్సల్టెన్సీ
Licence No:B-2056/AP/PER/100/5/10363/2023
94918 48888 తణుకు - రాజమండ్రి
cvsmc8888@gmail.com

సాక్షి క్లాసిఫైడ్స్

Services

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2541]

FOR SALE
■ పేపర్ ప్లేట్స్ తయారు చేసుకునే పలచటి బోర్డు (కలర్స్) మా వద్ద అమ్మకానికి కలదు. కావలసినవారు సంప్రదించండి. @ పశ్చిమగోదావరి జిల్లా. Ph: 9849887842 [HA-295]

Wanted
■ Required Primary Telugu, English, Maths Teachers High School Social Teacher, Eluru Contact : 9154647363 [P-192896]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185222]

■ కన్సల్టెన్సీకాదు. VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ :15000-40000, ఫ్రీ రూమ్+భోజనం. Hyb. 6309020999 [HA-296]

■ గర్ల్స్ హాస్టల్ ఇన్‌ఛార్జీలుగా పనిచేయుటకు స్త్రీలు కావలెను. జీతము: 10000/- నుండి 12000/- వరకు ఇవ్వబడును. Age: 20+ Qualification: SSC, ఉచిత భోజనం మరియు వసతి ఇవ్వబడును. పనిచేయు స్థలం: గుంటూరు. Master Minds. Contact: 91000 24059 [G-5485]

గమనిక
సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆల్‌రౌండర్.. గోపాలరెడ్డి మాస్టారు

- బోధనే కాదూ.. సామాజిక స్పృహ పెంపే లక్ష్యం
- రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తింపు
- మెజీషియన్‌గా, సైకాలజిస్ట్‌గానూ సేవలు
- ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన తేతలి జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు బాపతు గోపాలరెడ్డి


చెన్నైలో సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో రాష్ట్ర ఉత్తమ అవార్డు అందుకుంటూ..


న్యూఢిల్లీలో ఉత్తమ కెమికల్ మెజీషియన్ అవార్డు అందుకుంటూ..


అవార్డుతో ఉపాధ్యాయుడు గోపాలరెడ్డి

తణుకు అర్బన్: బోధనకే పరిమితం కాకుండా విద్యార్థులు, ప్రజల్లో సామాజిక స్పృహ పెంచేందుకు మెజీషియన్‌గా, సైకాలజిస్ట్‌గా రాణించి పలు అవార్డులు సాధించడమే కాక తల్లిదండ్రుల స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పలువురి మన్నన పొందుతున్నారు తేతలి జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు బాపతు మదనగోపాలరెడ్డి. తన 34 ఏళ్ల ఉపాధ్యాయ వృత్తిలో అధిక శాతం తణుకు జిల్లా పరిషత్ బాయ్స్ హైస్కూలులో పనిచేశారు. జీవశాస్త్ర ఉపాధ్యాయుడైన గోపాలరెడ్డి పత్రికల్లో ప్రచురితమైన విద్యార్థులకు ఉపయోగపడే కథనాల క్లిప్పింగ్‌లను సేకరించి గోడపత్రిక ద్వారా ఒక ప్రత్యేక బాక్సు ఏర్పాటు చేసి అందులో అమర్చేవారు. సైన్స్‌ఫెయిర్, ఇన్‌స్పైర్, బాలల సైన్స్ కాంగ్రెస్ వంటి పోటీల్లో తన మార్గదర్శకత్వంలో విద్యార్థులను ఒకసారి జాతీయ స్థాయికి, 8 సార్లు రాష్ట్రస్థాయిలో సత్తా చాటడమే కాకుండా 2020 సంవత్సరంలో ఉపాధ్యాయ విభాగంలో దక్షిణ భారతదేశ స్థాయి పోటీలకు సంబంధించి చెన్నైలో ప్రథమ బహుమతి సాధించారు. గతేడాది విశాఖపట్నంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డును మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ చేతులమీదుగా అందుకున్నారు.

తల్లిదండ్రుల స్ఫూర్తితో..

గోపాలరెడ్డి మాస్టారు తండ్రి బాపతు చెన్నారెడ్డి, తల్లి నాగరత్నం ఇద్దరూ ఎన్నో గుప్తదానాలు చేశారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ప్రతి ఏడాది సెప్టెంబర్ 3వ తేదీన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే పేద, మెరిట్ విద్యార్థినీ విద్యార్థులు 13 మందికి ఉచితంగా గోపాలరెడ్డి తన సతీమణి రుద్రమదేవి సహకారంతో సైకిళ్లు పంపిణీ చేస్తున్నారు. రుద్రమదేవి తణుకులో ప్రభుత్వ పాఠశాలలోనే ఉపాధ్యాయురాలు కావడంతో తమ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సాయం అందిస్తున్నారు. అలాగే కరోనా సమయంలో స్థానిక పేదలకు నిత్యావసరాలు అందజేసే కార్యక్రమాన్ని ప్రారంభించి ఇప్పటికీ కొనసాగిస్తుండటం విశేషం.

సైకాలజిస్ట్, మెజీషియన్ గానూ..

ఉపాధ్యాయ వృత్తిలోనే కొనసాగుతూనే సైకాలజిస్ట్‌గా సేవలందించారు గోపాలరెడ్డి మాస్టారు. భయం, ఆందోళన, డిప్రెషన్ వంటి మానసిక సమస్యలతో ఇబ్బందులు పడేవారికి ఉచితంగా కౌన్సెలింగ్ ఇచ్చేవారు. కోవిడ్ సమయంలో సైతం ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ద్వారా కోవిడ్ బాధితులను మానసికంగా బలోపేతం చేశారు. అలాగే మూఢనమ్మకాల నుంచి విద్యార్థులను, ప్రజలను దూరం చేసేందుకు మెజీషియన్‌గా సైన్స్ పరిజ్ఞానాన్ని జోడించి విద్యార్థులు, ప్రజల్లోను సామాజిక స్పృహ కలిగించేలా ప్రదర్శనలిచ్చి ఆకట్టుకున్నారు. ఈ క్రమంలో మ్యాజిక్ స్టార్, మ్యాజిక్ మాస్టర్ వంటి బిరుదులు సొంతం చేసుకున్నారు. అంతేకాకుండా న్యూఢిల్లీలో బెస్ట్ కెమికల్ మెజీషియన్‌గా అవార్డులు అందుకున్నారు. అంతర్జాతీయ ఇంద్రజాలికుల సమ్మేళనంలో భాగంగా శ్రీలంకలో సైంటిఫిక్ మ్యాజిక్‌పై తన ప్రసంగంతో పలు దేశాల ప్రముఖుల మన్ననలు పొందారు. కోవిడ్ సమయంలో విద్యార్థులు పుస్తకాలకు దూరమై సెల్‌ఫోన్‌లకు దగ్గరవుతున్న క్రమంలో సైన్స్‌పై ఆసక్తి కలిగించేలా ఫన్ సైన్స్ మ్యాజిక్ గేమ్స్ అండ్ పజిల్స్‌ను గోపీ మామ పేరుతో యూట్యూబ్ ద్వారా వీడియోలు రూపొందించి అందుబాటులో ఉంచారు.

క్లుప్తంగా

మహిళలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ లయన్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణం కడకట్లలోని జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో లయన్స్ క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో అధ్యక్షుడు వంగపండు రామమోహన్‌రావు ఆధ్వర్యంలో దాత జిల్లా క్యాబినెట్ ట్రజరర్ వట్టిపోలు రామసత్య కృష్ణారావు (రాము) ఆర్థిక సహకారంతో 50 మంది పేద రెల్లీ కాలనీ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చిన్నం జగదీష్, డాక్టర్ ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, సన్నిధి సూర్యనారాయణమూర్తి, ఆంజనేయస్వామి, క్లబ్ సభ్యులు, రెల్లి కాలనీ వాసులు పాల్గొన్నారు.

మీ కోసంలో మూడు అర్జీలు



వినతిపత్రాలు స్వీకరిస్తున్న కమిషనర్ డి.మురళీకృష్ణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక మునిసిపల్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. ప్రజా సమస్యలపై మునిసిపల్ కమిషనర్ డి.మురళీకృష్ణకు ముగ్గురు వినతిపత్రాలు అందజేశారు. టౌన్ ప్లానింగ్ రెండు అంశాలు, శానిటేషన్ సమస్యపై ఒకటి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వేణుగోపాలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

వీరవాసరం: జిల్లాలోని రైతాంగ సమస్యలు పరిష్కరించి, రైతులను ఆదుకోవాలని కోరుతూ సీపీఎం సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 10 రోజులు కావస్తున్న విత్తనాలకు చేతిలో సొమ్ములు లేక నారుమళ్లు వేసే పరిస్థితి కూడా లేక దిక్కులు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన ప్రభుత్వం మంచి మనసుతో రైతులకు రబీ ధాన్యం సొమ్ములు తొందరగా ఇచ్చి రైతన్నలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు పోతుల మృత్యుంజయ, యాళ్ల బండి నారాయణమూర్తి, లింగం సత్యనారాయణ, బాలౌ విజయకుమార్, కేతాజ్యోతి బస్సు, పాలా కోటేశ్వరావు, ఆచంట కనకాచలం, తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

ఉండి: భార్యను కాపురానికి పంపడం లేదంటూ భార్య, బావపై దాడి చేసిన ఘటనలో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం బీసీ కాలనీకి చెందిన కరణం భవానీ (దివ్యాంగురాలు, మూగ)కి ఉండికి చెందిన పొంగిలి ప్రసాద్‌కు ఏమిదేళ్ల క్రితం వివాహమయ్యింది. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే ఇటీవల భవానీని ఆమె భర్త కించపరుస్తూ అవమానకరంగా మాట్లాడుతుండటంతో ఆమె నెల రోజుల క్రితం పుట్టింటికి వచ్చేసింది. అయితే సుమారు రెండు రోజుల క్రితం ప్రసాద్ తన భార్యను కాపురానికి పంపాలంటూ పొగిలి దుర్గాప్రసాద్, లలిత, దాసరి దుర్గాదేవి, సాయి కుమారి అనే వారితో కలిసి వెళ్లి తన భార్యను కాపురానికి పంపించాలంటూ ప్రసాద్‌తో వారంతా గొడవకు దిగారు. ఈ గొడవలో భవానిపైనా ఆమె అన్న కరణం గోవింద్‌పైనా దాడి చేసి కొట్టారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్సై ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తిపై దాడి

యలమంచిలి: మండలంలోని ఏనుగువానిలంక గ్రామానికి చెందిన ఇనుకొండ మాణిక్యాలుపై అదే గ్రామానికి చెందిన రావూరి పుల్లారావు ఇటుకతో దాడిచేసి గాయపరిచారు. సోమవారం రోడ్డుపై నడచివెళుతున్న మాణిక్యాలుని పుల్లారావు దుర్భాషలాడారు. అదేమిటని ప్రశ్నించినందుకు ఇటుకతో మాణిక్యాలపై దాడిచేయడంతో తలకు గాయాలయ్యాయి. దీంతో మాణిక్యాలు పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో వైద్యం చేయించుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై కాకి శివన్నారాయణ కేసు నమోదు చేశారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ పథకాలు ప్రారంభించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): బ్రాహ్మణ కార్పొరేషన్ పథకాలు తిరిగి ప్రారంభించాలని, దేవాలయాల్లో, ట్రస్ట్ బోర్డుల్లో ప్రాముఖ్యత ఇవ్వాలని బ్రాహ్మణ సేవా పరిషత్ నాయకులు విజ్ఞప్తి చేశారు. తాడేపల్లిగూడెం శాసన సభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్‌ను సోమవారం కలిసిన పరిషత్ అధ్యక్షుడు పుల్లాభొట్ల వెంకట సూర్యనారాయణ మూర్తి, సెక్రటరీ బుద్ధవరపు సత్య వెంకట సుబ్బారావు, కోశాధికారి ప్రవా శ్రీనివాస్, గరికపాటి బాపయ్య శర్మ, తల్లాప్రగడ నరసింహారావు, ఇంజనీర్ అత్తిలి నాగ భాస్కర్ శ్రీనివాస్‌లు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

ఆదర్శంగా తణుకు సేఫ్‌కేర్ సెంటర్



హెచ్‌ఐవీ బాధిత చిన్నారులకు నిత్యావసర సరుకులు, ప్రొటీన్ టిన్స్ అందజేస్తున్న డాక్టర్ అరుణ. (ఫైల్)



హెచ్‌ఐవీ బాధిత చిన్నారులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న దాత డాక్టర్ మురళీకృష్ణ. (ఫైల్)

- దాతలు దైవ స్వరూపాలు
- హెచ్‌ఐవీ బాధిత చిన్నారులకు నిత్యావసర సరుకుల పంపిణీ
- ప్రతి నెలా 40 మంది అనాథ చిన్నారులకు నిత్యావసర సరుకులు

తణుకు అర్బన్ : హెచ్‌ఐవీ బాధిత చిన్నారుల సౌకర్యార్థం నిత్యావసర సరుకులు పంపిణీ చేయడంలో తణుకు సేఫ్‌కేర్ సెంటర్ ఆదర్శంగా నిలిచింది. హెచ్‌ఐవీతో ఇబ్బందులు పడుతూ తల్లిదండ్రులు లేకుండా బంధువులు, స్థానికుల నీడలో తలదాచుకున్న అనాథ చిన్నారులకు తణుకు సేఫ్‌కేర్ సెంటర్ ఆపన్న హస్తం అందిస్తోంది. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలో హెచ్‌ఐవీ బాధితులకు సేఫ్ కేర్ సెంటర్ ద్వారా సత్వర వైద్యసేవలు అందుతున్నాయి. బాధితులందరికీ వైద్యసేవలతో పాటు ఉచితంగా ప్రభుత్వం మందులు పంపిణీ చేస్తోంది. అర్హులైన వారికి పింఛన్లు కూడా పంపిణీ చేస్తున్నారు. అయితే హెచ్‌ఐవీతో ఇబ్బందులు పడే చిన్నారులు సమయానికి సమతుల్యమైన ఆహారం తీసుకోవాల్సి ఉంటుంది. క్రమం తప్పకుండా మందులు వాడుతూ మంచి ఆహారం తీసుకుంటే వారి జీవన కాలం పెరుగుతుందని వైద్యులు చెబుతున్నారు. అయితే హెచ్‌ఐవీ బారిన పడి తల్లిదండ్రులు లేక ఎవరో ఒకరి సంరక్షణలో ఉన్న చిన్నారులు మాత్రం పూర్తిస్థాయిలో ఆహారం అందక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం గుర్తించిన సేఫ్‌కేర్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ దాతలను సేకరించి సిబ్బంది సహకారంతో ప్రతినెలా 40 మంది చిన్నారులకు నిత్యావసర సరుకలు అందజేస్తున్నారు.

దాతల సహకారంతో...

గత ఏడాదిన్నరగా దాతల సహకారంతో హెచ్‌ఐవీ బాధిత చిన్నారులకు ప్రతి నెలా 5 కేజీల బియ్యం, వేరుశనగగుళ్ల, కందిపప్పు, బెల్లం, ఒంటి సబ్బులు అందిస్తున్నారు. తణుకుకు చెందిన పారిశ్రామికవేత్త మల్లిన రామచంద్రరావు ఆర్థిక సాయంతో మొదట ఏడాదిపాటు, గత ఏడు నెలలుగా స్థానిక ఇషా హాస్పటల్ అధినేత డాక్టర్ బొర్రా మురళీకృష్ణ ఆర్థిక సాయంతో నిత్యావసరాలు చిన్నారులకు అందిస్తున్నారు. తణుకు సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు అల్లూరి కరుణాకర చౌదరి అందించే ప్రొటీన్ టిన్స్‌ను నీరసంగా ఉన్న బాధితులందరికీ ప్రతిరోజూ అందిస్తున్నారు. ఇలా ఏడాదికో దాతను సేకరించి బాధిత చిన్నారులకు అండగా నిలుస్తున్నారు.



నిత్యావసర సరుకులు, ప్రొటీన్ టిన్స్

దాతల ఔదార్యంతో...



హెచ్‌ఐవీ బాధితుల్లో తల్లిదండ్రులు లేని చిన్నారుల పరిస్థితి చాలా దారుణంగా ఉంది. వారి బంధువుల సంరక్షణలో జీవిస్తున్న అనాథ చిన్నారులకు మంచి ఆహారాన్ని అందించాలనే సదుద్దేశ్యంతో ఏడాదిపాటు ప్రతినెలా నిత్యావసరాలు అందించే దాతను సమకూర్చుతున్నాము. ఆ దాత పంపించే సరుకులను నేరుగా వారితోనే చిన్నారులకు అందజేస్తున్నాం. అంతేకాకుండా ఆరోగ్యం బాగోలేని వారికి దాత సహకారంతో ప్రొటీన్ టిన్‌ను ప్రతిరోజూ అవసరమైన వారికి అందజేస్తున్నాం.

– డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ, తణుకు సేఫ్‌కేర్ సెంటర్ వైద్యాధికారి

ఆహారం అందించడం సంతోషంగా ఉంది



తణుకు సేఫ్‌కేర్ సెంటర్‌లో చిన్నారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారన్న విషయం తెలుసుకుని సంబంధిత విభాగ వైద్యులను సంప్రదించాను. అక్కడ ఉన్న అవసరం తెలుసుకుని ప్రతినెలా నిత్యావసర సరుకులు పంపిస్తున్నాను. క్రమం తప్పకుండా మందులు వాడుతూ మంచి ఆహారం తీసుకుంటే వారి ఆరోగ్యం మెరుగుపడుతుంది. చిన్నారులకు ఆహారం అందించే అవకాశం నాకు ఆ భగవంతుడే ఇచ్చాడని భావిస్తున్నాను.

– డాక్టర్ బొర్రా మురళీకృష్ణ, ఇషా హాస్పటల్ అధినేత, తణుకు

అసోసియేషన్ సేవా కార్యక్రమాల్లో..



సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటాం. అందులో భాగంగా తణుకు సేఫ్‌కేర్ వైద్యాధికారి డాక్టర్ రామకృష్ణ అడిగిన మేరకు బాధితుల సౌకర్యార్థం ప్రొటీన్ టిన్స్ అందజేస్తున్నాము. సెంటర్‌లో ఆరోగ్యం బాలేకపోయిన బాధితులకు ప్రతిరోజూ ఈ ప్రొటీన్స్‌ను అందజేస్తున్నారు. స్టాక్ అయిపోయిందనగానే వెంటనే ప్రొటీన్స్‌ను సెంటర్‌కి పంపిస్తున్నాము.

– అల్లూరి కరుణాకరచౌదరి, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, తణుకు

అక్కినేని శతజయంతి పురస్కారానికి కవి ప్రసాద్ ఎంపిక



వీఎస్‌వీ ప్రసాద్

తణుకు: పద్మవిభూషణ్ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి పురస్కరించుకుని ఇటీవల అక్కినేని జీవితం, నటజీవితంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో తణుకు పట్టణానికి చెందిన ప్రముఖ కవి వీఎస్‌వీ ప్రసాద్ ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. అక్కినేని సాంఘిక చిత్రాలు అనే అంశంపై ప్రసాద్ రచించిన వ్యాసరచన పోటీల్లో జాతీయ స్థాయిలో ఉత్తమ బహుమతి లభించినట్లు చెప్పారు. ఈ ఏడాది సెప్టెంబరులో హైదరబాదులో నిర్వహించే సభలో పురస్కారం అందజేస్తారని ఆయన వెల్లడించారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందించాలి



అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో ప్రమోదిని కుమారి

తణుకు టౌన్: బాలింతలు, గర్భిణుల సంరక్షణకు సంబంధించిన సదుపాయాలు, వైద్య సౌకర్యాల అందజేసేందుకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వర్కర్లు అవగాహన కలిగి ఉండాలని తణుకు ఐసీడీఎస్ సీడీపీవో ఎంవీఎస్ ప్రమోదిని కుమారి తెలిపారు. సోమవారం తణుకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణుల్లో రక్తహీనత గల మహిళలను గుర్తించి వారికి అవసరమైన పౌష్టికాహారం అందజేసేందుకు కృషి చేయాలని తెలిపారు. మహిళల్లో హెచ్‌బీ పెరిగేలా అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎం. అరుణకుమారి, సీహెచ్ వెంకట లక్ష్మీ, కృష్ణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు కే నళినీరాణి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి అధికారులంతా సహకరించాలి

- ప్రజలకు సేవకులుగా పనిచేయాలి
- ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్



మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం రూరల్: గ్రామాల అభివృద్ధికి అధికారులంతా సహకరించాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కోరారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ పొనుకుమాటి శేషులత అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో 284 సీసీ రోడ్లు, 174 యుజీడీలను పూర్తి చేశామన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కేవలం 39 రోడ్లు వేయడం జరిగిందన్నారు. ఎటువంటి అవకతవకలు లేకుండా పనిచేయాలని అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలని, ఆ తర్వాత అభివృద్ధే ప్రధానమన్నారు. అందరికీ గౌరవం ఇస్తామన్నారు. అధికారులంతా గ్రామాల్లోనే ఉండి ప్రజలకు సేవకులుగా పనిచేయాలన్నారు. ప్రజలకు, అధికారులు జవాబుదారీగా ఉండాలన్నారు. గ్రామాల్లోని సంపదను గ్రామ అభివృద్ధికి వినియోగించాలన్నారు. కలిసికట్టుగా గూడెం అభివృద్ధికి సహకరించాలన్నారు. తొలుత ఆర్‌డబ్ల్యుఎస్, వ్యవసాయ, విద్య, ఎలక్ట్రికల్, హౌసింగ్, పారిశుద్ధ్యం, ఎన్ఆర్ఈజీఎస్, రెవెన్యూ తదితర శాఖలపై రివ్యూ నిర్వహించారు. అధికారుల చెప్పే సమాధానాలకు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అసహనం వ్యక్తం చేశారు. తదుపరి సమావేశం నాటికి పూర్తి స్థాయి సమాచారంతో హాజరు కావాలని అధికారులకు హుకుం జారీ చేశారు. జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, వైస్ ఎంపీపీలు సూర్పని రామకృష్ణ, కట్టా రంగబాబు, తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీవో ఎస్.సుబ్రహ్మణ్య శర్మ, హౌసింగ్ డీఈ కేవీవీఎస్.ప్రసాద్, పీఆర్ డీఈ ఎన్.వేణుగోపాల్, మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్, ఎలక్ట్రికల్ ఏఈ అల్లు రామకృష్ణ, ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి, ఎమ్పీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా, ఉదయం 10.30గంటలకు సమావేశం ప్రారంభం కావలసి ఉండగా, గంట ఆలస్యంగా 11.30 గంటలకు ప్రారంభమైంది.

విద్యావ్యవస్థకు పెద్ద పీట

తాడేపల్లిగూడెం (టీఓసీ): కూటమి పాలనలో విద్యా వ్యవస్థకు పెద్ద పీట వేస్తామని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీసుకువెళ్తామన్నారు. ఉపాధ్యాయులు సహకారం ఎంతో అవసరమని చెప్పారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



విద్యార్థులతో అవగాహన కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ లక్ష్మణరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వి.లక్ష్మణరావు పేర్కొన్నారు. మలేరియా మాసోత్సవాలలో భాగంగా సోమవారం పట్టణ ఆరోగ్య కేంద్రం బేబీ సెంటర్ సమీపంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో సోమవారం వైద్యాధికారులు డాక్టర్ డి.శ్రావ్య, డాక్టర్ నిహారిక అధ్యక్షతన మలేరియా సబ్ యూనిట్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు జరిగాయి. నిహారిక మాట్లాడుతూ చలి, జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి మలేరియా నిర్ధారణ పరీక్షలు చేయించాలని, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. ఆరోగ్య పర్యవేక్షకులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ ఉన్నత పాఠశాలలో...

స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సత్యనారాయణ అధ్యక్షతన విద్యార్థులకు దోమల నివారణ చర్యలు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వి.లక్ష్మణరావు మాట్లాడుతూ మలేరియాపై అవగాహన కార్యక్రమాలు జూన్ మాసం అంతా కొనసాగుతాయని తెలిపారు. మలేరియా ఆడ ఎనాఫిలిస్ దోమ కాటు వల్ల వ్యాప్తి చెందుతుందని చెప్పారు. దోమ ఎక్కువ కాలం నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో సంతానోత్పత్తి చేస్తుందన్నారు. వ్యాధులు వ్యాప్తి చెందకుండా దోమల నియంత్రణ చర్యలలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు సిద్ధం.. సాగుకు సన్నద్ధం

- తొలకరి ఖరీఫ్ పనులు ప్రారంభం
- విత్తన శుద్ధిపై దృష్టి సారించాలన్న వ్యవసాయాధికారుల సూచనలు



పెంటపాడు మండలం ముదునూరు, ఆకుతీగపాడు ప్రాంతాల్లో నాట్లు వేసేందుకు వరి పొలాలు సిద్ధం చేస్తున్న దృశ్యం

పెంటపాడు: సార్వా నారుమడులు వేసే పనుల్లో రైతులు బిజీ అయ్యారు. నాణ్యమైన విత్తనం ఎంపికే కీలకమని వ్యవసాయ శాఖ అధికారుల సూచిస్తున్నారు. సరైన సమయంలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే కోతల సమయంలో అధిక దిగుబడులు సాధించవచ్చని చెబుతున్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో మండలాల వారీగా సార్వా వరి సాగు చేస్తున్నారు. ముఖ్యంగా ఈ ఖరీఫ్‌లో ఎంటీయూ 7029 (స్వర్ణ), పీఎల్‌ఏ 1100, ఎంటీయూ 1318, ఎంటీయూ 1061, 1064, 1153,1156, 1121 వంటి వరి వంగడాలను సాగు చేస్తున్నారు. కాలువల్లో నీరు వదిలినా ఇంకా శివారు ప్రాంతాలకు నీరు చేరకపోవడంతో వరుణుడిపై ఆధారపడి రైతులు నారుమడులు వేస్తున్నారు.

నారుమడి తయారీ ఇలా..

నారుమడులు, నాట్లు వేసేందుకు చేలను సిద్ధం చేసే ప్రక్రియపై మండల వ్యవసాయాధికారి కె.పార్థశారథి రైతులకు పలు సూచనలు చేశారు. ముందుగా 10 నుంచి 12 రోజుల వ్యవధిలో పొలాన్ని మూడు దఫాలుగా దమ్ము చేసి చదును చేయాలి. నీరు పెట్టడానికి తీయడానికి అనుకూలంగా ఏర్పాటు చేసుకోవాలి. ఐదు సెంట్ల నారుమడికి రెండు కిలోల నత్రజని వేయాలి. ఇది విత్తనం చల్లేముందు ఒక కిలో, విత్తిన 12 నుంచి 14 రోజుల్లో మరో కిలో నత్రజని చల్లాలి. ఒక కిలో భాస్వరం, కిలో పొటాష్ నిచ్చే ఎరువులను దుక్కిలో వేయాలి. చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో భాస్వరం రెట్టింపు వేయాల్సి ఉంటుంది. జింకు లోపాన్ని గమనిస్తే లీటరు నీటికి రెండు గ్రాములు జింకు సర్ఫేటు ద్రావణాన్ని పిచికారీ చేయాలి. విత్తిన 10 రోజులకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు సెంటు నారుమడికి 160 గ్రాములు చొప్పున వేయాలి లేదా క్లోరిపైరిపాస్ 2.0 మిల్లీ లీటర్లు నీటికి కలిపి విత్తన పది రోజులకు, 17 రోజులకు పిచికారీ చేయాలి. ఇంకా రైతులకు పంటలపై సలహాలు సూచనలు అవసరమైతే.. పరిష్కరించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు నిత్యం అందుబాటులో ఉంటున్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్తు



చెరుకువాడ పెదపేటలో స్టూడెంట్ కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

ఉండి: ప్రతీ ఒక్కరూ జీవితంలో ఉన్నత స్థాయికి రావాలంటే చదువుతోనే సాధ్యమవుతుందని నాయకులు తెలిపారు. సోమవారం చెరుకువాడ పెదపేట ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం ఎంజీ మంగతాయారు అధ్యక్షతన స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నాయకులు ఎంపీటీసీ సీహెచ్ క్రిష్టాఫర్, కట్టా రాంబాబు, ఉంగరాల నాగేశ్వరరావు మాట్లాడుతూ పిల్లల భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందన్నారు. అలాగే విద్యార్థుల పట్ల మరింత శ్రద్ధతో వారి భవిష్యత్‌ను ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో యిర్రింకి బుజ్జీ,వార్డు సభ్యుడు బిల్ మోరియా, కోట వెంకటేశ్వరరావు, పడమటి త్రిమూర్తులు, కుచ్చు కృష్ణ, మద్దాల శివ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని టూ టౌన్‌లోని యాగర్లపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్‌లు సింగిల్ ఫేజ్ టూ త్రిబుల్ ఫేజ్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 25వ తేదీన మంగళవారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు. యాగర్లపల్లి, కొబ్బరితోట, రామచంద్రరావుపేట, భాగ్యలక్ష్మిపేట తదితర పలు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

తాగునీరు అందించాలి



పెనుగొండ సచివాలయంలో వినతి పత్రం అందిస్తున్న నాయకులు

పెనుగొండ: కోడి పందేల దిబ్బ ప్రజలకు సత్వరం తాగునీటి అందించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్ వెంకటేశ్వరరావు కోరారు. ఈ మేరకు సోమవారం పెనుగొండ గ్రామ సచివాలయంలో కోడి పందేల దిబ్బవాసులతో కలిసి వినతిపత్రం అందజేశారు. 2008లో 1130 కుటుంబాలకు ఇంటి స్థలాలు ఇవ్వడంతో 600లకు పైగా ఇళ్లు నిర్మించుకొన్నారని తెలిపారు. అప్పటి నుంచి తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేశారని తెలిపారు. ఇప్పుడు నీటి సరఫరా నిలిచిపోవడంతో అధికార్లకు ఎన్నిసార్లు విన్నవించుకొన్నా పట్టించుకోవడం లేదన్నారు. తక్షణం తాగునీటిని అందించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మాదాసు నాగేశ్వరరావు, షేక్ పాదుషా, గుడల వాణి, జక్కంశెట్టి సాయిలు పాల్గొన్నారు.

మత్తుతో జీవితం చిత్తు



మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

ఉండి: మత్తు భారిన పడితే జీవితం చిత్తవుతుందని చైల్డ్ సేవ్ నెట్ డాన్ బాస్కో జవ జీవన్ బాలభవన్ విజయవాడ కోఆర్డినేటర్ లీలావతి అన్నారు. ఈ నెల 26న అంతర్జాతీయ మత్తు పదార్థాల దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని చెరుకువాడ జడ్పీ హైస్కూల్‌లో సోమవారం హెచ్‌ఎం జీవీఆర్‌కే కృష్ణంరాజు అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన సదుస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో లీలావతి మాట్లాడుతూ నేటి యువత, విద్యార్థులు చిన్నతనం నుంచి మత్తుకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. సిగరెట్, గంజాయి, గుట్కా, కైనీ, మద్యానిక బానిసయ్యి సమాజ వ్యతిరేక పనులకు పూనుకుంటున్నారని తెలిపారు. చెడు అలవాట్లతో నేరాలకు పాల్పడుతున్న వారిపై పోలీసులు రౌడీషీట్లు తెరిచి, కఠిన చర్యలు తీసుకుంటారన్నారు. ప్రతీ ఒక్కరూ సమాజిక భాద్యతగా యువత పెడదారిన పడకుండా తమ వంతు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జీఎం పార్వతీదేవి, కేవీ కృష్ణ, షేక్ గులాజీ, తదితరులు పాల్గొన్నారు.

మట్టి నమూనా సేకరణ

ఆకివీడు: స్థానిక సిద్ధాపురం రైల్వే గేటు వద్ద సోమవారం మట్టి నమూనాల్ని రైల్వే అండర్ పాస్ విభాగం సిబ్బంది సేకరించారు. ఆ ప్రాంతంలోని గంగానమ్మ కోడు మురుగు కాల్వ ప్రవహిస్తున్న ప్రాంతంలో మట్టిని సేకరించారు. ప్రస్తుతం ఇదే ప్రాంతంలో గంగానమ్మకోడు మురుగు నీరు ఉప్పుటేరులోకి ప్రవహిస్తుంది. దీని సమీపంలో అండర్ పాస్ నిర్మాణం ద్వారా మినీ వాహనాల రాకపోకలకు అనుకూలంగా ఉంటుందని రైల్వే అండర్ పాస్ విభాగం అధికారులు గుర్తించారు. ఇక్కడ అండర్ పాస్ నిర్మాణం జరిగితే కారులు, వ్యాన్లు, ఆటోలు, మోటారు సైకిళ్లు, సైకిళ్లు, ఇతరిత్రా చిన్న వాహనాలు అండర్ పాస్ గుండా వెళ్లే అవకాశం ఉంది. దీని ద్వారా దుంపగడప రైల్వే గేటు, లెవల్ క్రాసింగ్ గేటుల వద్ద వాహనాల రద్దీ తగ్గే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు. ఎట్టకేలకు అండర్ పాస్ నిర్మాణానికి మట్టి నమూనాలు సేకరించారు.